ప్రజాశక్తి
ఆదివారం 11 ఫిబ్రవరి 2024
5
పార్వతీపురం మన్యం

కారా మాస్టారు కథలపై నేడు సాహితీ ముచ్చట్లు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక గిరిజన భవన్‌లో స్నేహ కళాసాహితీ ఆధ్వర్యంలో 'కథకుల గురువు కా.రా మాస్టారి కథలతో కొంతసేపు' సాహితీ కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కథారచయిత గంటేడ గౌరునాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కథా దీపధారి కాళీపట్నం రామారావు మాస్టారు శత జయంతోత్సవం, కథానిలయం వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అతిథులుగా సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, సహజ సాహితీ సాంస్కృతిక సంస్థకు చెందిన ఎన్‌కె బాబు, వక్తలుగా శ్రీకాకుళం సిక్కోలు బుక్ ట్రస్టుకు చెందిన రచయిత, వక్త దుప్పల రవికుమార్, రాజాం రచయితల సంఘానికి చెందిన రచయిత పొదిలాపు శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయితలు, సాహితీవేత్తలు, సాహితీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆది నుంచీ
మంత్రి సిఫార్సులపై విముఖత

- ఆడుదాం ఆంధ్రాలో అవమానంపై రగులుతున్న వైసిపి శ్రేణులు
- రాజన్నదొర ఫిర్యాదుపై కానరాని స్పందన

ప్రజాశక్తి-సాలూరు

ఆయనో డిప్యూటీ సిఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి.. పార్వతీపురం మన్యం జిల్లాకు బాస్ ఆయనే.. జిల్లాలో ఆయన చెప్పిందే వేదంలా జరగాలి. ఆయన చేసిందే శాసనం కావాలి.. కానీ అలా జరగడం లేదు..ఆయన డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి హోదాలో చేసిన సిఫార్సులు బుట్టదాఖలా అవుతున్నాయి. ఆయన మాటకు విలువ లేకుండా పోతోంది. జరిగిన తప్పుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేఖ రాసినా స్పందన లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పురుషుల క్రికెట్ విభాగంలో పాచిపెంట మండల జట్టు విజేతగా నిలిచింది. పార్వతీపురం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీల్లో పార్వతీపురం జట్టుపై పాచిపెంట జట్టు గెలుపు సాధించింది. పాచిపెంట మండలం మన్యం జిల్లా లో వున్న మారుమూల గిరిజన మండలం. అలాంటి మండలం నుంచి క్రికెట్ క్రీడలో పాల్గొనడం,మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వెళ్లడమే గొప్ప విషయం. వెనుకబడిన మండలం నుంచి వచ్చిన క్రికెట్ జట్టు ఫైనల్ లో విజేత కావడం హర్షించదగ్గ పరిమాణం. జిల్లా స్థాయి లో విజేతగా నిలిచిన పాచిపెంట జట్టు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించింది. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా షీల్డ్, ధ్రువపత్రాలను జట్టు సభ్యులు అందుకున్నారు. విశాఖలో జరుగబోయే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించిన పాచిపెంట జట్టును డిప్యూటీ సీఎం రాజన్నదొర అభినందించారు.ఇంతలో ఏం జరిగిందో కానీ పాచిపెంట జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించలేదని జిల్లా అధికారులు నిర్ణయించారు. ఓడిపోయిన పార్వతీపురం జట్టునే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర సొంత నియోజకవర్గానికి చెందిన విజేత జట్టును కాదని ఓడిన జట్టును పంపించడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చ నీయాంశమైంది. క్రికెట్‌కు జెంటిల్‌మెన్ క్రీడ గా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఈ క్రీడలో ఇంతవరకు గతంలో ఎన్నడూ ఇలాంటి సంఘటన జరగలేదు. గెలిచిన జట్టును అవమానకరంగా ఇంటికి పంపించేసి ఓడిపోయిన జట్టును రాష్ట్ర స్థాయి పోటీలకు సాగనంపడం ద్వారా మన్యం జిల్లా అధికారులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టినట్లయింది.

తమకు జరిగిన అన్యాయంపై ఆందోళన చేస్తున్న క్రీడారులు (ఫైల్)

ఆది నుంచి మంత్రి సిఫార్సులపై విముఖత

ఎమ్మెల్యే నుంచి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, డిప్యూటీ సీఎం గా రాజన్నదొర బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏనాడూ జిల్లా అధికారులను శాసించే పరిస్థితి కనిపించలేదు. మన్యం జిల్లా ఏర్పాటు నుంచి కలెక్టర్ గా వున్న నిశాంత్ కుమార్ రాజన్నదొర చేసిన సిఫార్సులేవీ అమలు చేసిన దాఖలాలు లేవు. జిల్లాలో ఇతర అధికారపార్టీ ఎమ్మెల్యేలు చేసిన సిఫార్సులకు కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రాధాన్యత ఇచ్చారు. కానీ మంత్రి, డిప్యూటీ సీఎం హోదాలో రాజన్నదొర చేసిన సిఫార్సులు పట్టించుకున్న దాఖలాలు లేవని నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు.గతంలో గిరిజన సంక్షేమ డిడి నియామకం లో కూడా మంత్రి రాజన్నదొర ఒకరికి సిఫార్సు చేస్తే జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మరో అధికారపార్టీ ఎమ్మెల్యే సిఫార్సుకు ప్రాధాన్యత ఇచ్చారు.నియోజకవర్గంలో సస్పెండైన ఒక పంచాయతీ కార్యదర్శిని తిరిగి నియమించాలని రాజన్నదొర సిఫార్సు చేస్తే నియామకానికి చాలా కాలం పట్టింది. కొద్ది రోజుల క్రితం డిప్యూటీ డిఎంహెచ్ఒ నియామకం విషయంలో ఆయన చేసిన సిఫార్సు దాదాపు బుట్టదాఖలా అయిందని తెలుస్తోంది. తాజా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మంత్రి రాజన్నదొర సొంత నియోజకవర్గానికి చెందిన క్రికెట్ జట్టునే గెలిచిన తరువాత అవమానకర రీతిలో ఇంటికి పంపించడం పై పార్టీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించిన పాచిపెంట జట్టును ఎడ కుంటిసాకులు చూపించి సాగనంపడాన్ని పార్టీ నాయకులు కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారు.

ఫిర్యాదు పై స్పందన లేదు

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో మన్యం జిల్లా అధికారులు వ్యవహరించిన తీరుపై డిప్యూటీ సీఎం రాజన్నదొర రాష్ట్ర స్థాయి క్రీడాధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన పాచిపెంట జట్టు పై అనర్హత వేటు వేయడాన్ని ప్రశ్నిస్తూ ఆయన లేఖ రాసినా ఇంతవరకు స్పందన లేదు. ఈ వ్యవహారం లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తో పాటు ఇతర అధికారులతో ఆయన మాట్లాడి జరిగిన పొరపాటు ని సరిదిద్దాలని కోరినా ఫలితం లేకపోయింది.

చదువే సమాజాన్ని మార్చే ఆయుధం

- రచయిత గంటేడ గౌరునాయుడు
- ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాసం పరీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం

చదువొక్కటే సమాజాన్ని మార్చగలదని, ఆ చదువును ప్రతి విద్యార్థి ప్రేమించి ఆశ్వాదించాలని ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు అన్నారు. ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాసం పరీక్ష శనివారం పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక ఆర్‌కె, జనహిత కళాశాలలో పట్టణంలో గల అన్ని పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ప్రజ్ఞా వికాసం పరీక్ష పత్రాలను గౌరునాయుడు, సీనియర్ న్యాయవాది టి.జోగారావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి భాస్కరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా గౌరునాయుడు మాట్లాడుతూ నేటి విద్యార్థులు పరీక్షలంటేనే భయాందోళనకు గురవుతూ, చదువును మధ్యలోనే నిలిపివేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. ఇటువంటి నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సింది నైపుణ్యత, శిక్షణల అని అన్నారు. టి.జోగారావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షలకు ఈ ప్రజ్ఞా వికాస పరీక్ష దోహదపడుతుందన్నారు. ప్రపంచీకరణ విధానాలకు లోబడకుండా భవిష్యత్తు లక్ష్యసాధనకై కృషి చేయాలని, విద్యకు దూరంగా ఉన్న విద్యార్థులకు విద్యను అందించేలా తోటి విద్యార్థుల ఆలోచన మెరుగుపడాలని కోరారు. భాస్కరరావు మాట్లాడుతూ పరీక్షల్లో ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఏక దృష్టితో మంచి ఉత్తీర్ణత సాధించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని, నేటి మారుతున్న విద్యారంగంతో విద్యార్థుల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు పాలక ప్రభుత్వాలు చేపడుతున్నాయని అన్నారు. అటువంటి భ్రమలకు లోబడకుండా, శాస్త్రీయ విద్యతో మెలగాలని అన్నారు. కె.రాజు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల, విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థుల నైపుణ్యతను పెంచి, భవిష్యత్తులో ఉన్నత చదువులకు ప్రోత్సహించేలా వికాసం పరీక్షలు నిర్వహిస్తుందని అన్నారు. స్వాతంత్ర ఉద్యమ నాయకుల జీవిత చరిత్రలను ఆదర్శంగా చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్.సింహాచలం, శివ, సురేష్, అంజలి, కృష్ణ, శారద, శ్రావణి, కరిస్మా, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రజ్ఞా వికాసం పరీక్షా పత్రాలు ఆవిష్కరిస్తున్న గౌరునాయుడు, జోగారావు, భాస్కరరావు

సాలూరు : విద్యార్థులు అంకితభావంతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చునని టౌన్ సిఐ జిడి బాబు చెప్పారు. యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న పదోతరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష పత్రాలను ఆయన విడుదల చేశారు. పట్టణంలోని సాయి సూర్య స్కూల్, భాష్యం స్కూల్‌లో నిర్వహించిన పరీక్షలకు రెండు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ జిడి బాబు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే రీతిలో విద్యార్థులు హైస్కూల్ స్థాయి నుంచి సన్నద్ధం కావాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల పట్ల భయాందోళనలు పోగొట్టడానికే గత కొంతకాలంగా ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు టి.అఖిల్, సభ్యులు పాల్గొన్నారు.

అప్రెంటీస్ విధానం తెస్తే ఉద్యమిస్తాం : యుటిఎఫ్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఉపాధ్యాయులకు మళ్లీ అప్రెంటిస్ విధానం తెచ్చే ఆలోచనలో జగన్ సర్కార్ ఉందని తెలిసిందని, అదే నిజమైతే మళ్లీ అప్రంటీస్ అంతం... యుటిఎఫ్ పంతం అన్న ఉద్యమం తప్పదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఒక అశాస్త్రీయమైన ఈ అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని, అప్రంటీస్ అంతం... యుటిఎఫ్ పంతం అన్న నినాదంతో దశాబ్ద కాలం పాటు యుటిఎఫ్ పోరాటం చేసి, నిరాహార దీక్షలు చేసిన నేపథ్యంలో అప్రెంటీస్ రద్దు అయిందని గుర్తు చేశారు. అదే అప్రెంటిస్ విధానాన్ని మళ్లీ తీసుకొస్తామంటే యుటిఎఫ్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా జగన్ సర్కార్ ఉద్యోగులపైనా, ముఖ్యంగా ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరిస్తూనే ఉందన్నారు. ఎన్ని కక్ష సాధింపు చర్యలకు పూనుకొన్నా, ఎన్ని నిర్బంధాలు, ఎన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవ్యతిరేక విధానాలను అవలంభించినా యుటిఎఫ్ తప్పకుండా తిప్పికొడుతుందని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

అప్రెంటిస్ విధానం రద్దు చేయాలి : బిటిఎ

పాలకొండ : ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి రద్దు చేయించిన అప్రెంటీస్ విధానం మరల తిరిగి పునరుద్ధరించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కుమార్, గొల్ల ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మించి.. నమ్మిన వారిని ఇలా మోసగించడాన్ని తీవ్రంగా ఖండించారు. మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చెప్పి, అది చేయకపోగా ఇప్పుడు మళ్లీ అప్రెంటిస్ విధానం తిరిగి తీసుకురావడం ప్రభుత్వ నియంతృత్వానికి పరాకాష్ట అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఉపాధ్యాయ పోస్టులను పెంచి అప్రెంటీస్ విధానం రద్దు చేసి, మెగా డీఎస్సీని ప్రకటించాలని కోరారు. లేనిచో ఉద్యోగ, ఉపాధ్యాయులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రెండు హద్దు..అంతకంటే వద్దు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి -వీరఘట్టం

ఒకటి ముద్దు... రెండు హద్దు... అంతకంటే ఎక్కువ వద్దు అంటూ గర్భిణులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బగాది జగన్నాథరావు సూచించారు. శనివారం స్థానిక పిహెచ్‌సిలో పిఎంఎస్ కార్యక్రమాన్ని పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. అధికంగా కాన్పు వల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఒకటి లేదా రెండు కాన్పులతో సంతానం ఆపివేయాలని గర్భిణులకు సూచించారు. నెలలు నిండిన కొద్దీ వైద్య అధికారుల సలహాలు, సూచనలు పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. రక్తహీనత తక్కువగా ఉంటే ఐరన్ సిప్రోజన్ అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగిం చుకోవాలని అన్నారు. ముఖ్యంగా హైరిష్కు కేసులను గుర్తించి ఎప్పటికప్పుడు వారిని పర్యవేక్షించాలని వైద్యాధికారి పి.ఉమామహే శ్వరిని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అలాగే మందుల స్టోర్ రూమును, ల్యాబ్‌ను పరిశీలించారు. ఆర్‌బిఎస్‌కె దవళ భాస్కరరావు సిబ్బంది, ఉన్నారు.

ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

టేఖరుకండిని సందర్శించిన ఆర్‌పి సిసోడియా

ప్రజాశక్తి - కురుపాం

మండలం లోని కురుపాం పంచా యతీ పరిధిలో గల టేఖరుకండి గిరిజన గ్రామాన్ని ఎంసిహెచ్ ఆర్‌డి డైరెక్టర్ జనరల్ ఆర్‌పి సిసోడియ శనివారం సందర్శిం చారు. ఈ సందర్భంగా తాను పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు పిఒగా ఉన్నప్పుడు గిరిజన రైతులకు ఇచ్చిన జీడి తోటలను పరిశీలించి రైతులతో జీడి పంట లావాదేవీల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు ఆయనతో మాట్లాడుతూ జీడిపంట అయితే బాగానే వస్తుంది కానీ ఇక్కడ ప్రాసెసింగ్ యూనిట్ లేకపోవడంతో పలాస తీసుకు వెళ్లలేక ఇక్కడ వ్యాపారులకు అమ్మడంతో గిట్టుబాటు ధర రావడంలేదని తెలిపారు. కావున ఈ ప్రాంతంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రకృతి వ్యవసాయానికి వాడుతున్న ఘన ద్రవ జీవపదార్థాలను పరిశీలించారు. డిపిఎం షణ్ముఖరాజును ప్రకతి వ్యవసాయ పద్ధతులు, ఉపయోగిస్తున్న సేంద్రియ ఎరువులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జట్టు సంస్థ వ్యవస్థాపకులు డి.పారి నాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.

తోటపల్లి దేవస్థానం సందర్శన

గరుగుబిల్లి : మండలంలోని తోటపల్లి దేవస్థానాన్ని సిసోడియా సందర్శించారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారాయణ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మర్రాపు సత్యనారాయణ స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం, అనంతరం వారికి స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు గౌరీశంకర్ పాత్రో, తోటపల్లి దేవాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తమ్ముడ్ని హతమార్చిన అన్న

ప్రజాశక్తి - పాచిపెంట

ఆస్తి కోసం సోదరుడ్ని అతి కిరాత కంగా హతమార్చిన సంఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని గడివలసకు చెందిన కోరాడ జోగేశ్వరరావు (44), కోరాడ నర్సిం హులు అన్నదమ్ముల పిల్లలు. ఈ రెండు కుటుంబాల మధ్య గత ఐదారేళ్లుగా భూతగాదాలు జరుగుతున్నాయి. దీంతో వీరి మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో కోరాడ జోగేశ్వరరావు శనివారం సాయంత్రం తన పొలంలో పనులు చేసుకుంటున్నాడు. ఒంటరిగా ఉన్న జోగేశ్వరరావును అదును చూసుకొని నర్సింహులు అతని పీక, మర్మాంగాలను కొడవలితో కోయడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే నర్సింహులు స్థానిక పోలీసులకు లొంగిపోయాడు. నిందితుడు నర్సింహులుతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు ఈ సంఘటనలో ఉన్నట్టుగా భావిస్తూ పోలీసులు ఆరా తీసుకున్నారు. జోగేశ్వరరావు భార్య గౌరమ్మ, కుమార్తె గుణావతి, కుమారుడు లీలా ప్రసాద్ ఉన్నారు. సంఘటనా స్థలాన్ని పార్వతీపురం ఎఎస్‌పి సునీల్ షరోన్, సాలూరు సిఐ బాలకృష్ణ, పాచిపెంట ఎస్ఐ పి.నారాయణరావు, సిబ్బంది, డాగ్‌స్క్వాడ్ చేరుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సిహెచ్‌సికి తరలించారు.

హత్యకు గురైన జోగేశ్వరరావు

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

కేంద్రప్రభుత్వం గిరిజన, రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు, రాష్ట్రానికి చేసిన ద్రోహానికి నిరసనగా అన్ని ప్రజా సంఘాలు కలిసి దేశవ్యాప్తంగా ఈనెల16న తలపెట్టిన బంద్‌ను, మండల కేంద్రంలో చేపట్టబోయే ర్యాలీ, నిరసన సభల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు కోరారు. మండలంలోని గుజ్జువాయి, డి.బారామణి, పోరడంగూడా, జి.సివడ, ఉదయపురం గ్రామాల్లో గిరిజన సంఘం నాయకులతో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కులపై దాడిచేసి, జిఒ 3నురద్దు చేసి, అడవులను అదానీకి కట్టబెట్టిందుకు అటవీ సంరక్షణ చట్టానికి నిరసనగా ఆందోళన చేపట్టాలన్నారు. అలాగే జీడి పంటకు కేజీ రూ.200, చింత పండు కేజీ రూ.60కు ప్రభుత్వం కొనుగోలు చేయాలని, వాహనాలపై పెంచిన రోడ్ టాక్స్‌కు , కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలకు నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్తంగా రైతు, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో బంద్ చేపడుతున్నట్టు తెలిపారు. కావున అన్ని వర్గాల ప్రజలు బంద్‌లో పాల్గొని జయప్రదం కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు వాసు, అంగద, గణేష్, అనిల్, భవన కార్మిక సంఘం నాయకులు వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : బిజెపి ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రద చేయాలని కోరుతూ మండలంలోని భరణికి వలస, పెద్దవలస, సన్యాసిరాజుపేటలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం చేస్తున్న మోసాలకు వ్యతిరేకంగా ఈనెల 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్ జరుగుతుందని, ఈ బంద్‌లో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం సభ్యులు పొట్టంగి రాము, గబడారురాము,బోయినలక్ష్మణరావు పాల్గొన్నారు.

కొమరాడ : ఈనెల16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కూనేరు సంతలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు రామారావు, ప్రసాదు బాబురావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్.శివున్నాయుడు, రైతు సంఘం నాయకులు అప్పల నాయుడు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

బంద్‌కు సిఐటియు మద్దతు

సాలూరు : మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న జరగనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని, మద్దతు తెలపాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు పిలుపునిచ్చారు.

శనివారం స్థానిక మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాజకీయ శిక్షణా తరగతుల ప్రారంభానికి ముందు ఆయన సిఐటియు జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. యూనియన్ సీనియర్ నాయకులు టి.వెంకటరావు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల ప్రయోజనాలను విస్మరించిందని చెప్పారు. కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తూ సామాన్య మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారాలు మోపిందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జరగనున్న బంద్‌ను విజయవంతం కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, పట్టణ నాయకులు టి.ఇందు, టి.శంకరరావు పాల్గొన్నారు.

కురుపాం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ఇదేనా రైతులపై చిత్తశుద్ధి?

ప్రజాశకి - విజయనగరం ప్రతినిధి

రైతుల సంక్షేమం, వ్యవసాయరంగ అభివృద్ధిపై మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ గడపదాటడం లేదు. వారి సంక్షేమం, అభివృద్ధి సంగతి కాస్త పక్కనబెడితే, వ్యవసాయరంగం కోసం తలపెట్టిన సాగునీటి కాలువల ఏర్పాటులో కనీసం నీటివాటం కూడా తెలియని, తెలుసుకోలేని, పట్టని పరిస్థితుల్లో ఉన్నారు మన పాలకులు. హా... రైతులా పోతే పోనీ... అనుకున్నారో లేక వారి గురించి ఆలోచించడం వల్ల మనకేమిటి? అనుకున్నారో గానీ సుజల స్రవంతి కాలువ అలైన్‌మెంట్ మార్పు చేయాలంటూ రైతాంగం ఏడాదిగా మొత్తుకుంటున్నా అధికార పార్టీకి చెందిన నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు పట్టడం లేదు. సుజల స్రవంతి కాలువ ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాలకు 8లక్షల ఎకరాలకు సాగునీరు, 2.30లక్షల జనాభాకు రోజుకు 4.46టిఎంసిల తాగునీటితోపాటు మొత్తం సాగునీటిలో 1శాతం నీటిని పారిశ్రామిక అవసరాలకు అందించాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇందులో అత్యధికంగా సుమారు 3.94లక్షల ఎకరాల మేర ఉమ్మడి విజయనగరం జిల్లాకు రావాల్సి వుంటుంది. ఇందులో భాగంగా ఈ జిల్లాలో ప్రభుత్వం తలపెట్టిన కాలువల అలైన్‌మెంట్ వల్ల ఇప్పటికే సాగునీటి సదుపాయం ఉన్న సారవంతమైన భూములను ఎక్కువ మంది కోల్పోనున్నారు. ఇదే కాస్త ఎగువ ప్రాంతంలో తూర్పు కనుమలకు ఆనుకుని కాలువ అలైన్‌మెంట్ రూపొందిస్తే రైతుల నుంచి సేకరించాల్సిన భూమి తగ్గడంతోపాటు లిఫ్ట్‌ల సంఖ్య 6నుంచి 4కు తగ్గుతుంది. భవిష్యత్తులో నిర్వహణ భారం కూడా ఆమేరకు తగ్గే అవకాశాలు ఉంటాయి. రైతులు, రైతు సంఘం నాయకులతోపాటు సాగునీటి పారుదల శాఖలో ఆరితేరిన ఇంజినీరింగ్ నిపుణులు సైతం ఇదే మాట చెబుతున్నారు. ఇలా ప్రత్యామ్నాయం మార్గం చూపడంతోపాటు భూసేకరణలో 2013 చట్టాన్ని అమలు చేయాలని కూడా రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికిగానీ, ప్రత్యేకించి మన జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులకుగానీ పట్టలేదు. దీంతో, రైతులంతా సంఘటితమై ఏడాదిగా అనేక సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎప్పటికప్పుడు నిరసనలు వ్యక్తం చేసినా పాలకులకు పట్టకపోవడంతో రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టడడంతోపాటు తగిన కార్యాచరణ రూపొందించేందుకు ఈనెల 2న గంట్యాడ మండలం తాటిపూడి వద్ద నిర్వాసిత రైతు సదస్సును నిర్వహించిన విషయం విధితమే. ఈ సదస్సుకు ఎస్.కోట, గజపతినగరం నియోపకవర్గాల పరిధిలోని సుమారు 50గ్రామాలకు చెందిన సుమారు 500 మంది రైతులు హాజరు కావడం విశేషం. సదస్సుకు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల తాజా, మాజీ ఎమ్మెల్యేలను కూడా ఆహ్వానించినప్పటికీ తాజాలు హాజరు కాలేదు. కనీసం రైతులకు వారి తరపున సందేశం తెలియ జేయడం, లేదా రాలేకపోవడానికి గలకారణాలను తెలియ జేయడం వంటివి కూడా లేదు. దీన్నిబట్టి అధికార పార్టీ ఎమ్మెల్యేలకు రైతుల సమస్యలపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. టిడిపికి చెందిన గజపతినగరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలువ అలైన్‌మెంట్ మార్చేవరకు పోరాడుతామని, ఇదే విషయాన్ని త్వరలో రానున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ దృష్టికి కూడా తీసుల్తానని హామీ ఇచ్చారు. ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్యాయం చేయమే కాకుండా, ఏకపక్ష, నిర్బంధ చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు.

అలైన్‌మెంట్ మార్పుకోసం జరుగుతున్న రైతుల పోరాటానికి వీరి వంతు ప్రయత్నం ఎలా ఉంటుందన్నది కాస్త పక్కనబెడితే సదస్సుకు హాజరు కావడం మంచి పరిణామమేనని రైతులు, ఇతర ప్రజానీకం అభిప్రాయపడుతున్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అసెంబ్లీలో చర్చకు వచ్చే విధంగా ప్రయత్నిస్తానని చెప్పినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. దీంతో, అధికార పార్టీ నాయకులు, ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిపిఎం మాత్రం తొలి నుంచి నికరంగా రైతుల పక్షాన మాట్లాడుతోంది. అలైన్‌మెంట్ మార్చేవరకు రైతుల పక్షాన పోరాడుతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తమ్మినేని సూర్యనారాయణ హామీ ఇచ్చారు. దీన్నిబట్టి ఏ పార్టీ చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చని జనం చర్చించుకుంటున్నారు.

ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఉపాధి హామీ పనులు సక్రమంగా అమలు చేయాలని, గిట్టుబాటు కూలి వచ్చేలా చర్యలు తీసుకోవాలని, పనిచేసే చోట టెంట్లు, మంచినీరు, మెడికల్ కిట్లు ఏర్పాట్లు చేసి చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జిసన్యాసిరావు, బడ్నాన ప్రతాప్, జయన్న, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని నీలంచెరువు పనులను పరిశీలించి, అనంతరం వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని, దీనివల్ల గిట్టుబాటు కూలి రేట్లు ఇవ్వడం లేదని అన్నారు. కేరళలో రూ.650 రోజు కూలీ ఇస్తూ ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీ చట్టం పట్ల అధికారులు అవగాహన కల్పించాలని కోరారు ఉపాధి హామీ పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కూలీలు వలసలు పోతారన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీని ముందుకు నడిపించేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు.

దోమల నివారణకు స్ప్రేయింగ్

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని పలు గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్ నిర్వహించామని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. ఉలిపిరి, కొమరాడ, పెదఖేర్జిల హాస్టళ్లలో దోమల మందు పిచికారీ నిర్వహణ శనివారం వైద్య సిబ్బంది చేపట్టారు. ఈ మేరకు పెదఖేర్జిల హాస్టల్‌లో స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని డిఎంఒ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ వసతి గృహాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా, విద్యార్థులు జ్వరాల బారినపడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఫోకల్ స్ప్రేయింగ్ చేపట్టినట్లు, ఇందుకు గానూ ఆల్ఫా సైపర్ మెత్రిన్ (ఎసిఎం5%) దోమల నివారణ మందును పిచికారీ చేయించామని తెలిపారు. తద్వారా ఆ ప్రదేశాల్లో దోమలు స్థావరాలు ఏర్పర్చుకోలేవని, ఈ మందు ప్రభావం దాదాపుగా రెండు నెలల వరకు ఉంటుందని అన్నారు. అనంతరం ఆయన అక్కడ విద్యార్థులతో మాట్లాడి పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, హెచ్ఎం వెంకటరావు, సబ్ యూనిట్ అధికారి సిహెచ్ ధనుంజయరావు, వైద్య సిబ్బంది రమేష్, మంగమ్మ, అనిల్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేనలో చేరిన రామకృష్ణ

జనసేనలో చేరిన గేదెల

ప్రజాశక్తి - మక్కువ

జనసేన రాష్ట్ర నాయకులు, పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో సాలూరు నియోజకవర్గం ఎస్‌టి కేటగిరికి చెందిన గేదెల రామకృష్ణ శనివారం జనసేన పార్టీలో చేరారు. సాలూరు నియోజకవర్గం నుండి విష్ణువర్ధన్, రాజశేఖర్ ఆధ్వర్యంలో రామకృష్ణ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి సాదరంగా నాదెండ్ల మనోహర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థి విజయానికి సాలూరు నియోజకవర్గంలో అంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అవ్వ సంతోష్, పొట్ట శేఖర్, మెంటాడ, సాలూరు, మక్కువ మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

15న అగ్రిగోల్డ్ బాధితుల న్యాయ పోరాట దీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 15న విజయవాడ ధర్నా చౌక్‌లో అగ్రిగోల్డ్ బాధితుల న్యాయ పోరాట దీక్షను జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇవి నాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో చిన్న మదుపుదారులందరికీ న్యాయం చేస్తానని, ఆరు నెలల్లో బాధితులందరికీ పూర్తి న్యాయం చేస్తానని తన పాదయాత్రలోనూ, ఎన్నికల ప్రచారంలోనూ ప్రతి నియోజకవర్గంలో మాట ఇచ్చి ఈ రాష్ట్రంలో ఉన్న 20 లక్షల మంది బాధిత కుటుంబాలతో ఓట్లు వేయించుకొని గద్దెనెక్కారన్నారు. ఐదేళ్లు పూర్తి కావస్తున్నా అగ్రిగోల్డ్ బాధితులకు ఎటువంటి న్యాయం జరగకపోవడం బాధాకరమని ఇది కచ్చితంగా జగన్మోహన్‌రెడ్డి మాట తప్పడం మడం తిప్పడమేనని తాము భావిస్తున్నామని అన్నారు. చివర ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్లో అగ్రిగోల్డ్ బాధితుల కోసం నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 15న విజయవాడ ధర్నా చౌక్‌లో న్యాయ పోరాట దీక్షను చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెంబలి శ్రీనివాసరావు, సాలాపు అనంతరావు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న విజయచంద్ర

మండల టిడిపి నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సీతానగరం

మండల టిపిడి నూతన కార్యవర్గం శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయ్‌చంద్ర అధ్యక్షతన స్థానిక టిడిపి కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల టిడిపి అధ్యక్షులుగా పెంట సత్యం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా రౌతు వేణుగోపాల నాయుడు, ఉపాధ్యక్షులుగా సబ్బాన శ్రీనివాసరావు, వాకాడ పారినాయుడు, అధికార ప్రతినిధిగా సోమిరెడ్డి రమేష్ నాయుడు, పార్టీ కార్యాలయం కార్యదర్శిగా రెడ్డి సింహాచలం నాయుడు నిమితులయ్యారు.

వారపు సంతలో గుడ్ మార్నింగ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి వారపు సంతలో టిడిపి కార్యకర్తలు గుడ్‌మార్నింగ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. గిరిజన అభివృద్ధే లక్ష్యంగా చేసుకొని ఐటిడిఎ అందించిన ఘనత మన గిరిజనుల కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చిన చంద్రన్న సారథ్యం వహించిన టిడిపిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని కార్యకర్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన్, చంద్రశేఖర్, మురళీ కెఎస్ఎస్ దమయంతి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని తహశీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండలంలోని మొండెంఖల్, నీలకంఠాపురం తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్‌ఒలతో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉండేలా చూడాలని, విధుల్లో ఏ మాత్రం అలసత్వం వహించినా చర్యలు తప్పవని బీఎల్‌ఒలను సూచించారు. కార్యక్రమంలో బిఎల్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ వేణుగోపాల్

13న ఉల్లిభద్ర వద్ద 'శంఖారావ' సభ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, వైసిపి నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాధమే శంఖారావమని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. ఈ సందర్భంగా ఈనెల 13న గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర వద్ద జరిగే బహిరంగ సభలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలో ఆమె స్వగృహం వద్ద మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శనరావు అధ్వర్యంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సంధ్బంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ 'శంఖారావం' అనే కీలక ప్రచారానికి శ్రీకారం చుట్టిందన్నారు. దీని ద్వారా కార్యకర్తలు నేరుగా నారా లోకేష్‌కు తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఇప్పటికే యువగళం పాదయాత్ర పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో లోకేశ్ పర్యటించారని, జగన్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపైనా, అరాచక పాలనపై గొంతెత్తి ప్రజలకు మద్దతుగా నిలిచారని అన్నారు. శంఖారావంతో కార్యకర్తలు నారా లోకేష్ వైపు మరింత చేరువయ్యేలా చేస్తుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు ఉన్నారు.

భామిని : ఈనెల 13న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం కార్యక్రమంలో భాగంగా పాలకొండలో పాల్గొనున్నారని, దీన్ని జయప్రదం చేయాలని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ తెలిపారు. ఈ మేరకు భామినిలో కార్యకర్తలు, నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని టిడిపి-జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని, శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరారు. మండల టిడిపి అధ్యక్షులు భోగాపురపు రవినాయుడు, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నిమ్మల నిబ్రం, మండల ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్, మండల జనసేన అధ్యక్షులు రుంకు కిరణ్, సర్పంచ్ లోపింటి రాజేష్, నాయకులు గుడుబిల్లి లక్ష్మీపతి, వివిధ విభాగాల అధ్యక్షులు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వరి

సాలూరు: ఈనెల 14న టిడిపి శంఖారావంలో భాగంగా పట్టణానికి వస్తున్న జాతీయ కార్యదర్శి లోకేష్ పర్యటనను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్పీ భంజ్‌దేవ్ కోరారు. శనివారం ఆయన నియోజకవర్గ ఇన్ఛార్జి సంధ్యారాణితో కలిసి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పట్టణంలోని కొల్లి వారి పొలంలో బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని భంజ్‌దేవ్ కోరారు. సమావేశంలో సాలూరు మండల, పట్టణ, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, పిన్నింటి ప్రసాద్‌బాబు, గుల్ల వేణుగోపాలరావు, చలుమల్ల వెంకట్రావు, అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు కూనిశెట్టి భీమారావు,మండల నాయకులు బూస తవుడు పాల్గొన్నారు.

సచివాలయ భవనాన్ని పారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - సీతానగరం

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని నిడగల్లులో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే జగన్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ గ్రామానికి కోటి రూపాయలు నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి శాశ్వత భవనాలు నిర్మించి ప్రజలకు సేవలు అందుబాటులో తెచ్చేలా కృషి చేస్తుందన్నారు. ప్రతి చిన్న సమస్య గతంలో మండలాలకు, జిల్లాలకు వచ్చేవారిని ఇప్పుడు గ్రామ సచివాలయంలోనే పరిష్కారమవుతుందన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములునాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, వైస్ ఎంపిపి సూర్యనారాయణ, సర్పంచ్ ఎం.ఆరుద్రమ్మ, మండల వైసిపి అధ్యక్షులు బి.చిట్టిరాజు, నాయకులు గజాపు శ్రీనివాసరావు, ఆర్‌వి పార్థసారథి, ప్రభుదాసుతో పాటు పలువురు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని ప్రజలకు తాగునీరందించే డి-శిర్లాం పైలెట్ ప్రాజెక్టులో తలెత్తిన సాంకేతిక సమస్యలను మరో రెండు రోజుల్లో తొలగించి సోమవారం నాటికి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. శనివారం ఆయన మండలంలో నీటి సమస్యపై స్పందిస్తూ ప్రాజెక్టు అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టు డిఇ పావని, జెఇ బసవరాజుతో కలిసి డి-శిర్లాంలోని ప్రాజెక్టులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను వివరణ కోరగా, నీటి సరఫరా చేసే మోటార్లలో ఇసుక చేరడం వల్ల నీటి పంపిణీకు తీవ్ర అంతరాయం కలిగిందని తెలిపారు. గత 15 రోజులుగా ఇసుకను తోడిస్తున్నప్పటికీ ఇసుక త్వరితగతిన పేరుకుపోవడంతో పనులకు అంతరాయం కలుగుతుందన్నారు. అయినా మరో రెండు రోజుల్లో నీటి సరఫరాను పునరుద్ధరించగలమని అధికారులు తెలిపారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఎన్నడూ లేని విధంగా పైలెట్ ప్రాజెక్టులో ఇసుక చేరడం అనేది కొత్తగా ఏర్పడిన సమస్య కనుక, దీనిపై అధ్యయనం చేసి జిల్లా అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సాంకేతిక సమస్య వల్ల నీటి సరఫరాకు అంతరాయం కలగడం సహజమేనని, దీనిపై పలు రాజకీయ పార్టీలు రాద్ధాంతం చేయడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపిలు సిద్ధ జగన్నాథరావు, బంకూరు రవికుమార్, నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, బలగ నాగేశ్వరరావు, బొమ్మి రమేష్, ఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

కనీస వేతనం ఇవ్వాలని ఆశాల నిరసన

ప్రజాశక్తి - సీతంపేట

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని శనివారం ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.లక్ష్మి మాట్లాడుతూ చలో విజయవాడకు ఆశా వర్కర్లు వెళ్తే తమ సమస్యలు, బాధలు చెప్పుకోవడానికి వెళ్తే వినకుండా ప్రభుత్వం పోలీసులచే తరిమివేశారన్నారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. ఒకేసారి వేతనం అందించాలన్నారు. సిహెచ్‌డబ్ల్యూఒలను ఆశాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని ఇచ్చిన సంక్షేమ పథకాలన్ని అందించాలన్నారు. మెటర్నటీ లీవులు ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉద్రిక్తత చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సంఘం అధ్యక్షులు ఎస్.లక్ష్మి, కార్యదర్శి దీప, కమిటీ సభ్యులు విజయ, ఉష, విజయలక్ష్మి, శ్రీలత, హైమావతి, రాజేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్‌ను అభివృద్ధిలో నడిపిస్తా

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని అధ్యక్షులు బొబ్బిలి వెంకట దామోదర్ అన్నారు. ఈ మేరకు సొసైటీ అధ్యక్షులుగా శనివారం ప్రమాణస్వీకారం చేశారు. తొలుత ఎంపిపి ఉరిటి రామారావు మాట్లాడుతూ పిఎసిఎస్ ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. గరుగుబిల్లి సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి మాట్లాడుతూ పిఎసిఎస్ ద్వారా రైతులకు అవసరమైన రుణాలను మంజూరు చేయాలన్నా రు. పెద్దూరు సర్పంచ్ మచ్చ నారాయణమ్మ, ఉప సర్పంచ్ తెర్లి యల్లంనాయుడు మాట్లాడుతూ ఆయా గ్రామాల రైతులకు విరివిగా రుణాలు అందజేసి బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపిపి ప్రతినిధి నేరడుబిల్లి జనార్ధననాయుడు, పిఎసిఎస్ సభ్యులు బత్తల పకీరునాయుడు, వైసిపి నాయకులు రౌతు రామినాయుడు, నల్ల శ్రీరాములునాయుడు, మర్రాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

12న ప్రభుత్వ పెన్షన్‌దారుల సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 12న సోమవారం ఉదయం 10 గంటలకు రిటైర్డ్ ప్రభుత్వ పెన్షన్‌దారుల సమావేశం స్థానిక పెన్షనర్ల సమావేశ మందిరంలో జరుగుతుందని ప్రభుత్వ పెన్షన్‌దారుల అసోసియేషన్ కార్యదర్శి డి.గణపతిరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ప్రభుత్వ పెన్షన్ దారులంతా హాజరు కావాలని, ఈనెల 29 వరకు సమావేశ మందిరంలో లైఫ్ సర్టిఫికెట్లు చేస్తామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -భామిని

మండలంలోని గురండి ప్రధాన రహదారి నేరడి బ్యారేజ్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గురుండి గ్రామానికి చెందిన పప్పల సుగ్రీవులు (50) కుటుంబ సభ్యులతో కలిసి రాజమండ్రి వలస వెళ్లి అక్కడే నివాసం ఉంటున్నారు. సుగ్రీవులు తమ్ముడు కొడుకు పెళ్లి నిమిత్తం ఆయన భార్య శ్రీదేవి, కుమారులతో పాటు, పప్పల మధు, ఆయన భార్య ఈశ్వరి స్వగ్రామానికి వచ్చారు. పెళ్లి పనుల నిమిత్తం శనివారం బయటకు వెళ్లిన సుగ్రీవులు, శ్రీదేవి, మధు, ఈశ్వరి తిరిగి ఇంటికి వేర్వేరు ద్విచక్రవాహనాలపై వస్తున్నారు. గురండి సమీపానానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించగా, క్షతగాత్రులను భామిని పిహెచ్‌సికి తరలించారు. సుగ్రీవులు పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయన అక్కడే చనిపోయారు. మిగిలిన ముగ్గుర్ని సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో శ్రీదేవి పరిస్థితి కూడా విషమంగానే ఉంది. ఎఎస్ఐ శాంతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుగ్రీవులుకు కుమారులు తేజ, మహేష్ ఉన్నారు. తండ్రితో పాటు పెళ్ళిక చూద్దామని వచ్చామని, ఈ రోజు మా నాన్న మాకు లేరని, తల్లి పరిస్థితి విషమంగా ఉందని కుమారులు కన్నీరుమున్నీరైన రోధిస్తున్నారు.

మృతుడు సుగ్రీవులు (ఫైల్)

తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వేసవికి ముందే జిల్లాలో ఎదురవుతున్న తాగునీటి ఎద్దడిపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు కోరారు. శనివారం ఆయన పార్వతీపురంలో మాట్లాడుతూ గత వారం రోజులుగా వేసవి ఎండలు ప్రారంభమయ్యాయన్నారు. దీంతో జిల్లాలో అక్కడక్కడ తాగునీటి సమస్య కనిపిస్తోందన్నారు. ముఖ్యంగా పార్వతీపురం మండలంలోని నర్సిపురం, డోకిశీల తదితర గ్రామాల ప్రజలు గత పది రోజులుగా తాము తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామంటూ నిరసన చేపట్టినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోవడం శోచనీయమని అన్నారు. సాక్ష్యాత్తు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సైతం తాగునీటి సమస్యపై నర్సిపురం గ్రామస్తులు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. దీంతో తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక గ్రామస్తులు ఆవేదనకు లోనవుతున్నార న్నారు. వేసవి ఆరంభం నుంచే తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత మండల, జిల్లా పరిషత్‌లకు ఉందన్నారు. అయినప్పటికీ కనీస స్పందన లేకపోవడం అన్యాయమని అన్నారు. కనీస అవసరమైన తాగునీటిని ప్రజలకు అందించేలా జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. ఇదిలా ఉండగా పార్వతీ పురం పట్టణంతో పాటు పలు గ్రామాల ప్రజలు తాగునీటికి అలమట్టిస్తున్నారన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే జిల్లాలో పారిశుధ్యం పడకేసిందని విమర్శించారు. మురుగు కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే జిల్లా యంత్రాంగం తాగునీరు, పారిశుధ్యం తదితర వాటిపై దృష్టి సారించాలని కోరారు.

టీకాలతో వ్యాధులు దూరం : డిఎంఒ

ప్రజాశక్తి - సీతానగరం

పిల్లలకు పలు వ్యాధుల నుంచి టీకాలు పూర్తి రక్షణ కల్పిస్తాయని డిఎంఒ డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని నీలకంఠపురం, గుచ్చిమి గ్రామాల్లో టీకా కార్యక్రమాన్ని శనివారం తనిఖీ చేశారు. పిల్లలకు వేసిన టీకాల వివరాలను రికార్డులోనూ, ఎంసిపి కార్డుల్లో పరిశీలించి సకాలంలో వేయడం జరుగుతున్నదీ, లేనిదీ తేదీలను, పిల్లల వయస్సును పరిశీలించారు. పిల్లలకు వేస్తున్న ప్రతి టీకా ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించాలని, టీకా వివరాలు అదే రోజు ఆన్లైన్ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల ఆరోగ్య విషయమై అడిగి తెలుసుకున్నారు. జ్వర లక్షణాలుంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. పిల్లలకు పలు ప్రాణాంతకమైన వ్యాధులు రాకుండా టీకాలు తప్పనిసరి అని ముఖ్యంగా పోలియో, న్యుమోనియా, అతిసారం, క్షయ, హెపటైటిస్, తట్టు, రూబెల్లా, కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం తదితర వ్యాధుల నుంచి రక్షణకు టీకాలు సకాలంలో వేయాలన్నారు. అత్యవసర మందులు గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జయలక్ష్మి, రవణమ్మ, సంధ్యారాణి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

టీకాలపై అవగాహన కల్పిస్తున్న డిఎంఒ జగన్మోహన్

నిబంధనలు పాటించరా ?

ఇష్టానుసారంగా భారీ వాహనాల రాకపోకలు
భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని చినగొడవ రెవెన్యూ పరిధిలో గల క్వారీ వల్ల సమీప గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్వారీ నుంచి భారీ వాహనాలు నిత్యం తిరుగుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు తమ ప్రాణాలను అరచేతులో పెట్టుకొని బయటకు వస్తున్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల దుమ్మూ, ధూళి ఎగసపడి ప్రజలు తీవ్ర అస్వస్థకు గురి చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లపై భారీ వాహనాలను ఇష్టానుసారంగా నడుపుతున్నారు. దీనిపై గ్రామస్తులు లారీ డ్రైవర్లు అడగ్గా వారు లారీలను రోడ్డుకు అడ్డంగా నిలిపివేసి తమ యాజమాన్యం సూచనలు మేరకే పనిచేస్తున్నామని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీ రోడ్డుకు అడ్డంగా నిలిపివేయడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. దీంతో వాహనదారుడు స్థానిక ఎస్సైను ఆశ్రయించగా ఎస్సై తనదైన శైలిలో భారీ వాహనదారులకు హెచ్చరికలు జారీ చేసి రాకపోకలకు మార్గం సుగమమం చేస్తామని తెలిపారు. యంత్రాలతో ట్రాన్సుర్ చేసేటప్పుడు వాటిపై టార్పన్లు కానీ, వేరే రకమైన రక్షణ పరికరాలు వినియోగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా లారీలు నిలిపివేయడంతో స్తంభించిన ట్రాఫిక్

ఉమెన్ మిలటరీ పోలీసుగా స్వప్న రాణి ఎంపిక

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని చిలకలపల్లికి చెందిన ఉరిటి స్వప్నరాణి ఉమెన్ మిలటరీ పోలీసుగా ఎంపికైంది. విశాఖపట్నం ఎఆర్ఒ పరిధిలో జిల్లా నుంచి ఎంపికైంది. స్వప్నరాణి తండ్రి 108 ఉద్యోగి, కాగా తల్లి గృహిణి.

పివికి భారత రత్నపట్ల హర్షం

ప్రజాశక్తి - సాలూరు

బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని పివి నరసింహారావు కి భారతరత్న రావడం హర్షనీయమని శ్రీవెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు అన్నారు. శనివారం పివి నరసింహారావుకు నివాళిగా విద్యార్థులు పివి ఆకారంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానిగా పివి నరసింహారావు తీసుకొచ్చిన సంస్కరణలు దేశాభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధాని పివి నర్సింహరావు ఆకారంలో కూర్చున్న విద్యార్థులు ౦౦

ఎంఇఒ-1(ఎఫ్ఎసి)గా సామల

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండల విద్యాశాఖాధికారి-1గా సామల సింహాచలం శనివారం పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ కార్యాలయంలో పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు, సిఆర్ఎంటిలు, మున్సిపల్ ఉపాధ్యాయులు సామల సింహాచలంను కలిసి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సామల మాట్లాడుతూ మండలాన్ని విద్యాపరంగా అన్ని విషయాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు, సిఆర్ఎంటిలు, సంఘ నాయకులంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ- 2 కె. ప్రసాదరావు, సీతానగరం, జియ్యమ్మవలస, వీరఘట్టం ఎంఇఒలు మువ్వల వెంకటరమణ, ఎం.శ్రీనివాసరావు, డి గౌరునాయుడు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

Government of Andhra Pradesh
Endowments Department

E-PROCURMENT TENDER NOTICE

Re Construction Mandapam of Sri Uma Sahitha Kamalingeswara Swamy Temple at Galavilli (V), Balijipeta (M), Parvathipuram Manyam District. NIT NO.P/COE/1487/2023-8, Dt.18.12.2023. For further details log onto website "https://tender.apeprocurment.gov.in"for further details contact Ph. 9741595461, 9491598948.

EXECUTIVE AUTHORITY
Sri Uma Sahitha Kamalingeswara Swamy Temple
Galavilli (V), Balijipeta (M), Parvathipuram Manyam District,